రోగుల పట్ల బాధ్యతగా మెలగాలి : డీడీఎంహెచ్‌వో

చేవెళ్ల, జూన్ 24 : ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల బాధ్యతగా మెలగాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఆలనా పాలిటీవ్ కేర్ సెంటర్ వైద్యులు, సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ హోమ్ విజిట్‌లో భాగంగా 10 నుంచి 12 మందిని చూడాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించాలని, రిలీవర్ వచ్చేవరకు నైట్ డ్యూటీ చేసినవారు వెళ్లిపోకూడదన్నారు. ముందస్తు అనుమతి లేకుండా సెలవులు పెట్టకూడదన్నారు.

ఇదేందయ్యా ఇది..

కలెక్టరేట్‌లో ప్రజావాణి.. సెల్‌ఫోన్లలోనే నిమగ్నమైన అధికారులు



రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమం అది. బాధితులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఏర్పాటు చేసింది ప్రజావాణి. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో తమ సమస్యలు అధికారులకు చెప్పుకుంటే అవి పరిష్కారం అవుతాయన్న నమ్మకంతో, ఆశతో బాధితులు జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున వచ్చారు. ఆ సమస్యలు వినడానికి అన్ని శాఖల అధికారులు కూడా వచ్చారు. కానీ, బాధితులు తమ సమస్యలు వివరిస్తుంటే వారి సమస్యలు వినడం మరిచి సెల్‌ఫోన్లలో నిమగ్నమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన ప్రజావాణికి కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి సంగీతతో పాటు అన్ని శాఖల జిల్లాస్థాయి అధికారులు హాజరయ్యారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరిస్తుంటే.. మరోవైపు అధికారులు సెల్‌ఫోన్లలో నిమగ్నమయ్యారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యను కలెక్టరేట్‌లో చెప్పుకుందామనుకుని వచ్చిన ప్రజలు అధికారుల చేతుల్లో సెల్‌ఫోన్లను చూసి అవాక్కయ్యారు. స్వయంగా జిల్లా కలెక్టర్ ఎదుటే పరిస్థితి ఇలా ఉంటే.. వారి వారి కార్యాలయాలకు వెళ్లాక పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోలేక పోతున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సెల్‌ఫోన్లలో నిమగ్నం కావడంతో సమస్యల గురించి చర్చించేందుకు డీఆర్‌వో వారిని ఒకటికి రెండుసార్లు పిలిస్తే తప్ప వినిపించుకోని పరిస్థితి తలెత్తింది.



ప్రజావాణిలో సెల్‌ఫోన్లలో నిమగ్నమైన అధికారులు

అది కులీకుతుబ్‌షాహీల కాలంలో నిర్మాణమైన చెరువు. ఈ చిన్న చెరువు ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో భాగంగా ఉంది. ఈ చెరువు ఆధునికీకరించేందుకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కూడా ప్రకటించింది. ఇంతటి ప్రాధాన్యత కలిగిన చెరువు ఇప్పుడు కాలుష్యపు కాసారంగా మారింది. చెరువు పై ప్రాంతాల్లో ఉండే కాలనీలు, ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే మురుగంతా దీనిలోకే చేరుతోంది. చుట్టు పక్కల ప్రాంతాల వారు ఇళ్లలోని చెత్తనంతా ఇందులోనే వేస్తున్నారు. దీనికి తోడు చెరువు ఎఫ్‌టీఎల్ చాలా వరకు అన్యాక్రాంతమైంది.



కంప చెట్లతో నిండి ఉన్న ఇబ్రహీంపట్నం చిన్న చెరువు

చిన్నచెరువు.. కంపు కంపు!

వ్యర్థాలతో నిండిన ఇబ్రహీంపట్నం చిన్న చెరువు

- ఎఫ్‌టీఎల్‌లో పెద్ద ఎత్తున వెలిసిన అక్రమ కట్టడాలు
- కాలనీలు, ఫంక్షన్ హాళ్ల నుంచి వచ్చే మురుగు నీరంతా చెరువులోకే..
- కంపచెట్లతో పొంచి ఉన్న ప్రమాదం

ఇబ్రహీంపట్నం, జూన్ 24: ఇబ్రహీంపట్నం పెద్ద చెరువులో భాగంగా ఉన్న చిన్న చెరువు మురికి కూపంగా మారింది. ముక్కుపుటాలు అదిరేలా కంపు కొడుతోంది. కాలుష్యపు కాసారంగా మారిన ఆ చెరువు చుట్టుపక్కల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పైగా ఈ చెరువులో ఏపుగా పెరిగిన కంపచెట్లతో కనీసం కాలు పెట్టడానికి కూడా వీలు లేకుండా ఉంది. చెరువు పై భాగంలో ఉన్న కాలనీలు, ఫంక్షన్ హాళ్లనుండి వచ్చే మురుగుతో నీరంతా పచ్చగా మారి కాలుష్యకారకంగా తయారైంది. చెరువు పక్కన కాలనీలో నివాసం ఉండే వారే గాకుండా కట్టపై వెళ్లే వాహదారులు కూడా ఈ కంపును భరించలేక పోతున్నారు. అంతేగాక ఈ చెరువు ఆక్రమణలకు గురై వందకు పైగా కట్టడాలు వెలిశాయి. 40 ఏళ్లుగా ఏనాడూ పూర్తిస్థాయిలో నీటిమట్టం చూడని జనం 2022లో కురిసిన భారీ వర్షాలకు ఈ చెరువు నిండి అలుగు పారడంతో ఆక్రమణల బండారం పూర్తిగా బయటపడింది. నాగార్జునసాగర్- హైదరాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న చెరువును ప్రభుత్వం ఓ వైపు పర్యాటకంగా తీర్చిదిద్దడానికి ప్రయత్నాలు చేస్తోంది. అయితే, అధికార యంత్రాంగం ఈ చెరువు గురించి పట్టనట్లే ఉండడంతో దీని ఉనికికే ప్రమాదం ఏర్పడింది. కొందరు రాత్రి వేళల్లో వ్యర్థాలను కూడా చెరువులోనే తెచ్చి పోస్తున్నారు. అంతేగాక వర్షాలకు తిరిగి చెరువులోకి నీరొచ్చినా ఇళ్లల్లోకి నీరు రాకుండా అడ్డుకట్టగా రాత్రివేళల్లో మట్టి తెచ్చి పోస్తున్నారు. కులీకుతుబ్‌షాహీల కాలంలో నిర్మాణమై చరిత్రాత్మక నేపథ్యం కలిగిన ఈ చెరువును కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.



చెరువులోకి పారుతున్న మురుగునీరు



చెరువులో వెలిసిన అక్రమ నిర్మాణాలు

చెరువు సుందరీకరణకు రూ.20కోట్లు మంజూరు

ఇబ్రహీంపట్నం చెరువు సుందరీకరణకు రూ.20 కోట్లు మంజూరైనట్లు ఇటీవలే ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగానే హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు ప్లాన్ కూడా రూపొందిస్తున్నారు. మూడేళ్ల క్రితం చిన్న చెరువు తూర్పు భాగాన రూ.25 లక్షలు ఖర్చు చేసి వాకింగ్‌ట్రాక్, పార్కును ఏర్పాటు చేశారు. 2022లో చెరువు నిండిన సమయంలో ఇది పూర్తిగా మునిగిపోయింది. ఒక ప్లానింగ్ అనేది లేకుండా దీనిని ఏర్పాటు చేశారన్న విమర్శలు వినిపించాయి. ఈ చెరువులో నీటిమట్టం తగ్గడంతో ఈ మధ్యనే వాకింగ్ ట్రాక్ బయటపడింది.



చెరువులో వేసిన వ్యర్థాలు

చెరువు ఆక్రమణలపై అదనపు కలెక్టర్‌కు నివేదించాం



చిన్నచెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలపై క్షేత్ర స్థాయిలో విచారణచేసి జిల్లా అదనపు కల్టెకర్‌కు నివేదిక ఇచ్చాం. కొత్తగా ఆక్రమణలు జరుగకుండా రెగ్యులర్‌గా పర్యవేక్షణ చేస్తున్నాం. చెరువు పైన ఉన్న కాలనీల నుండి మురుగు నీరు చెరువులోకి రాకుండా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు వివరించాం.

- జి.ఉషారాణి, డీఈ, నీటిపారుదల శాఖ

ఎస్టీపీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం



ఇబ్రహీంపట్నం చిన్న చెరువులోకి పై కాలనీలు, ఫంక్షన్ హాళ్లనుంచి మురుగునీరు రాకుండా చర్యల కోసం ప్రయత్నిస్తున్నాం. ఎస్టీపీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం. ఇక్కడే గాకుండా భాగ్యనగర్ కాలనీ, రాయపోల్ రోడ్డు వెంట ఉన్న వెంకటరమణ కాలనీలో కూడా ఎస్టీపీల నిర్మాణం తప్పనిసరైంది. అందుకు కావాల్సిన నిధులకోసం వేచి చూస్తున్నాం.

- రవీందర్‌సాగర్, మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో

బాలికలదే హవా

ఫస్టియర్‌లో 72.49, సెకండియర్‌లో 42.46 శాతం ఉత్తీర్ణత

రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సర అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలికలు సత్తా చాటారు. సోమవారం మధ్యాహ్నం ఇంటర్ ఫలితాలను ఇంటర్ బోర్డు విడుదల చేసింది. ఈ ఫలితాల్లో ఫస్టియర్‌లో 72శాతం మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులో 47.98 శాతం, సెంకడియర్‌లో 42.46 శాతం ఉత్తీర్ణత నమోదు కాగా ఒకేషనల్‌లో 50.98 శాతం నమోదైంది.

అమ్మాయిలదే హవా..

ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాల్లో అమ్మాయిలు సత్తా చాటారు. ఫస్టియర్, సెకండియర్‌లో బాలికలే పైచేయి సాధించారు. వీటితో పాటు ఒకేషనల్ కోర్సుల్లో కూడా అమ్మాయిల హవా కొనసాగింది. ఇంటర్ ఫస్టియర్‌లో బాలురు 68.99 శాతం ఉత్తీర్ణులు కాగా 77.08 శాతం బాలికలు ఉత్తీర్ణులయ్యారు. అలాగే ఒకేషనల్ కోర్సులో ఇంటర్ ఫస్టియర్‌లో 38.91 శాతం ఉత్తీర్ణత బాలుర సాధించగా 67.43 శాతం ఉత్తీర్ణత బాలికలు సాధించారు. ఇంటర్ సెకండియర్‌లో బాలుర ఉత్తీర్ణత 40.25 శాతం నమోదు కాగా బాలికల ఉత్తీర్ణత 46.19 శాతం నమోదైంది. అలాగే ఒకేషనల్ కోర్సులో బాలుర ఉత్తీర్ణత 49.14 శాతం నమోదు కాగా బాలికల ఉత్తీర్ణత 55.92 శాతం నమోదైంది.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం రూ.10 వేల వేతనం అమలు చేయాలని, గుడ్లకు అదనంగా బడ్జెట్ కేటాయించాలని లేదా అంగన్‌వాడీ సెంటర్లకు సరఫరా చేసినట్లు సరఫరా చేయాలని కోరారు. అవసరమైన గ్యాస్‌ను సబ్సిడీలో ఇవ్వాలని, మధ్యాహ్న భోజన నిర్వహణను అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు ఇవ్వొద్దని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఎలాంటి షరతులు లేకుండా తమకు బ్యాంక్ రుణాలు ఇవ్వాలని వారు కోరారు.

ఆధునిక సేద్యం లాభదాయకం

వ్యవసాయ శాస్త్రవేత్తలు దామోదర్ రాజు, పవన్‌చంద్రారెడ్డి



అవగాహన సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్ రాజు

ఆమనగల్లు, జూన్ 24: పంటల సాగులో రైతులు తగిన మెలకువలు పాటించి పెట్టుబడులు తగ్గించుకొని దిగుబడులు పెంచుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వరి ప్రధాన శాస్త్రవేత్త సీహెచ్ దామోదర్‌రాజు, మృత్తిక శాస్త్రవేత్త పవన్ చంద్రారెడ్డిలు సూచించారు. ఆధునిక సేద్యం రైతులకు అన్ని విధాలా లాభదాయకమని అన్నారు. మండలంలోని రాంనుంతల గ్రామంలో సోమవారం విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో వానాకాలం వరిపంట సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో అరుణకుమారి అధ్యక్షతన నిర్వహించిన సదస్సుకు శాస్త్రవేత్తలు దామోదర్ రాజు, పవన్ చంద్రారెడ్డి, ఏడీఏ ఆదిలక్ష్మీలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రాంనుంతల గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకుంటున్నట్లు దామోదర్‌రాజు ప్రకటించారు. ఇందులో భాగంగా రైతులకు రాబోవు మూడు సంవత్సరాల వరకు వ్యవసాయ పరమైన సలహాలు, సూచనలు అందజేయడం జరుగుతుందని, విత్తనాల ఎంపిక, చీడ పీడల నివారణ, మట్టి నమునా సేకరణ, భూసార పరీక్షల యొక్క లాభాలపై శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. పంటల సాగులో రసాయన ఎరువుల వినియోగం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చు అన్నారు. నేల స్వభావాన్ని బట్టి రైతులు పంటలను సాగు చేసుకోవాలని దామోదర్ రాజు, పవన్ చంద్రారెడ్డిలు సూచించారు. రైతులు పంటల సాగులో ఏవైనా సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో అరుణకుమారి, ఏఈవోలు శివతేజ, మీనాక్షి, రైతులు గడిగె సత్తయ్య, గుండమోని నర్సింహ, పుట్టి యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

చిరుత కలకలంతో ప్రజల బెంబేలు!

ఆనవాళ్లను గుర్తించిన అటవీశాఖ అధికారులు

- పాదముద్రలు చిరుతవా? లేక హైనావా? అనే సందేహం
- ల్యాబ్‌కు పంపిన ఫారెస్ట్ అధికారులు
- రెండు బోన్లు, పది కెమెరాలను ఏర్పాటు సిబ్బంది

శంషాబాద్ రూరల్, జూన్ 24 :శంషాబాద్ మండల పరిధిలోని ఘాన్సిమియాగూడలో ఆదివారం చిరుత కలకలంతో ప్రజలు బెంబెలెత్తిపోయారు. దాంతో సోమవారం జిల్లా ఫారెస్ట్ అధికారి సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది మండల పరిధిలోని ఘాన్సిమియాగూడ, శంకరపురం పరిసరాల్లో చిరుత ఆనవాళ్ల(పాద ముద్రలు)ను గుర్తించారు. ఈ మేరకు రెండు బోన్లు, పది సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఘాన్సిమియాగూడ చెరువు వద్దకు చిరుత వచ్చిందని, దాని పాదముద్రలు గుర్తించామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, ఆదివారం రాత్రి రెండు లేగదూడలను చంపిందని ఆయా గ్రామాల రైతులు తెలిపారు. అయితే, అసలు అది చిరుతనా? లేక హైనానా అనేది అధికారులకు అంతు చిక్కడం లేదు. ఘాన్సిమియాగూడ చెరువు వద్ద గుర్తించిన పాదముద్రల శాంపిళ్లను ల్యాబ్‌కు పంపించనున్నట్లు అధికారులు తెలిపారు. కొన్ని ప్రాంతాల్లో చిన్న వయస్సు గల చిరుత పులి పాదముద్రలు ఉన్నాయని, మరికొన్ని ప్రాంతాల్లో హైనా పాదముద్రలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. ఏదిఏమైనా శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపితే ఆ గుర్తులు చిరుతవా? హైనావా? అడవి పిల్లివా? అనేది తేలుతాయని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. రైతులు ఒంటరిగా పొలాల వద్దకు వెళ్లవద్దని, గుంపులు, గుంపులుగా వెళ్లాలని సూచించారు. త్వరలోనే మరిన్ని సీసీ కెమెరాలు, బోన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. గతంలో ఎయిర్‌పోర్టులో చిరుత పులిని పట్టుకున్నామని, ఒకవేళ ఇక్కడ కూడా చిరుత సంచరిస్తున్నట్లయితే త్వరలోనే బంధిస్తామని, సిబ్బంది గస్తీ తిరుగుతున్నారని చెప్పారు. చిరుత ఎవరికి కనిపించినా వెంటనే అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. మంగళవారం మరిన్ని బోన్లు ఏర్పాటు చేస్తామని వారు చెప్పారు.



ఘాన్సిమియాగూడ చెరువు వద్ద చిరుత పాదముద్రల ఆనవాళ్లను గుర్తిస్తున్న అటవీ శాఖ అధికారులు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న లబ్ధిదారులు

మా ఇళ్లు మాకు ఇప్పించండి

జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం లబ్ధిదారుల మొర

కలెక్టరేట్ ఎదుట ధర్నా, కలెక్టర్‌కు వినతి

రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : మాకు కేటాయించిన ఇళ్లు మాకు ఇప్పించాలని కర్మన్‌ఘాట్-నందనవనంలోని జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం-ఫేజ్-3 లబ్ధిదారులు జిల్లా కలెక్టర్ శశాంకను కోరారు. తమ సమస్యను పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కర్మన్‌ఘాట్‌లో నిర్మించిన జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం ఇళ్లను 512 మందికి కేటాయించినట్లు లబ్ధిదారులు శ్రీనివాస్ రాథోడ్, రాజ్‌కుమార్, నీల నాయక్, మోతీలాల్ నాయక్, శ్రీనివాస్ రెడ్డి, సత్యనాయుడు, గుణసుందరి, తీతాదేవి, మాధవి, వాసు చెప్పారు. 2018లో ఒక్కో లబ్ధిదారుడు రూ.80,250 చొప్పున మొత్తం 512 మంది రూ.4.10 కోట్లు డీడీని జీహెచ్‌ఎంసీ కమిషనర్ పేరిట తీసి ఇచ్చామని తెలిపారు. మాకు కేటాయించిన ఇళ్లను కొంత మంది కబ్జా చేశారని, ఈ విషయంలో లోకాయుక్తలో కేసు వేయగా మాకు ఇళ్లను అప్పగించాలని తీర్పు వచ్చిందని తెలిపారు. మా ఇళ్లు మాకు అప్పగించకుంటే పెద్ద ఎత్తున ధర్నా చేస్తామని లబ్ధిదారులు హెచ్చరించారు.





కళాశాల అదనపు గదుల తాళాలు వెంటనే ఇవ్వాలి

తాండూరు, జూన్ 24: తాండూరు పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల అదనపు గదుల నిర్మాణం పూర్తై ప్రారంభించినా కాంట్రాక్టర్ బిల్లులు రాలేవనే సాకుతో అదనపు గదుల తాళం వేసుకోని విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాడని ఎస్ఎఫ్ఐ, విద్యార్థి ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. వెంటనే ప్రభుత్వ అధికారులు కాంట్రాక్టర్ నుంచి అదనపు గదుల తాళాలు ఇప్పించి, విద్యార్థులకు మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు బుగ్గప్ప, ఎస్ఎఫ్ఐ తాండూరు డివిజన్ నాయకులు దీపక్, కల్యాణ్, సురేష్, ఎమ్మార్పీఎస్ మాజీ నాయకులు బలరాం, విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల నాయకులు

రేపు పాఠశాలల బంద్

వికారాబాద్, జూన్ 24: ఈనెల 26న(రేపు) పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు ఏబీవీపీ వికారాబాద్ నాయకులు తెలిపారు. వికారాబాద్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్ పాఠశాలలో విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తూ అనుమతిలేని పుస్తకాలు అమ్ముకుంటూ విద్యను వ్యాపారంగా మలిచారని ఆరోపించారు. ప్రైవేటు, కార్పొరేట్, ఇంటర్నేషనల్ పాఠశాలల్లో అక్రమంగా లక్షలకు లక్షలు ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజు నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని, నిబంధనలు పాటించని యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ హరీష్ రావు, టౌన్ సెక్రటరీ మహేష్, జాయింట్ సెక్రటరీ జగదీష్, అనిల్, రాజేందర్, కౌశిక్, నవీన్, సునీల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

ఎన్‌టీటీతో మల్లారెడ్డి యూనివర్సిటీ ఒప్పందం

మేడ్చల్ టౌన్, జూన్ 24: సేల్స్ ఫోర్స్ సాంకేతికపై తమ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదివే విద్యార్థులకు పూర్తి అవగాహన కల్పించడానికి ఎన్‌టీటీ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నామని మల్లారెడ్డి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మైసమ్మగూడ మల్లారెడ్డి యూనివర్సిటీలో సోమవారం ఎన్‌టీటీ సంస్థతో మల్లారెడ్డి యూనివర్సిటీ వారు ప్రత్యేకంగా ఒప్పందం చేసుకున్నారు. ఈసందర్భంగా ఇరువురు ఒప్పందపత్రాలను సమర్పించుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం కులపతి ఎస్.కే.రెడ్డి, డీన్ రవీంద్రులు, ఎన్‌టీటీ డేటా సంస్థ ఉన్నత అధికారులు డాక్టర్ తయ్యబా, డాక్టర్ మీరావలి, డాక్టర్ నవీన్ కుమార్, డాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్‌టీటీ డేటా సంస్థ ప్రతినిధులకు ఒప్పంద పత్రాలను సమర్పిస్తున్న మల్లారెడ్డి











కనుల పండువగా రామలింగేశ్వర స్వామి పల్లకీసేవ



స్వామివారి పల్లకీసేవలో పాల్గొన్న ఆలయ చైర్మన్, ఈవో, భక్తులు

కీసర, జూన్ 24: కీసరగుట్టలో శ్రీ రామలింగేశ్వరస్వామి వారి పల్లకీసేవ కనుల పండువగా జరిగింది. స్వామివారి నిత్య సేవలో భాగంగా సోమవారం ఉదయం గర్భాలయంలో మూలవిరాట్‌కు శ్రీమహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మన్ నాగలింగంశర్మ ఆధ్వర్యంలో ఈవో సుధాకర్ పర్యవేక్షణలో భక్తులు పల్లకీసేవ నిర్వహించారు. శివనామస్మరణతో కీసరగుట్ట మారుమోగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా

వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

మేడ్చల్, జూన్ 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో వ్యాధుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మేడ్చల్ అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్యా సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వైద్య, ఆరోగ్య అధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పంచాయతీ అధికారితో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ శుక్రవారం తప్పకుండా ఇంటింటికీ వెళ్లి జ్వర సంబంధమైన కేసులను ముందుగానే గుర్తించడం, ఫాగింగ్ కార్యకలాపాలు, వ్యాప్తి చెందకుండా నిరోధించడానికి సానుకూల కేసులు గుర్తించాలన్నారు.

కాల్వల మరమ్మతుకు అంచనాలు తయారు చేయాలి

- నీటిపారుదలశాఖ ఎస్ఈకి స్పీకర్ ఆదేశం

ధారూరు, జూన్ 24: లక్నాపూర్ ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ కాల్వలను పరిశీలించి మరమ్మతుకు అంచనాలు తయారు చేయాలని శాసనసభ స్పీకర్ జి.ప్రసాద్‌కుమార్ సోమవారం నీటిపారుదలశాఖ చేవెళ్ల సర్కిల్ ఎస్ఈకి ఉత్తర్వులు జారీచేశారు. లక్నాపూర్ ప్రాజెక్టు పరిధిలోని మోమిన్‌కలాన్, రాజాపూర్, మోమిన్‌కుర్దు, నాగారం, అంతారం గ్రామాల ఆయకట్టుకు నీరందించే తొమ్మిది కిలోమీటర్ల కుడి కాల్వ, 12కిలోమీటర్ల ఎడమ కాల్వ ఉన్నాయని ఆయకట్టుదారులు స్పీకర్ దృష్టికి తెచ్చారు. కాగా ఈ కాల్వల్లో పూడిక మట్టి పేరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగి ఆయకట్టుకు నీరందటం లేదని, వీటిని మరమ్మతు చేయించాలని వారు కోరారు. ఆయకట్టుదారుల వినతి మేరకు ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ కాలువలను పరిశీలించి కాలువల మరమ్మతులకు అంచనాలు తయారు చేయాలని నీటిపారుదల శాఖ చేవెళ్ల సర్కిల్ ఎస్ఈని ఆయన ఆదేశించారు.



ఆర్టీసీ డీఎం సుధాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్థులు

మాచన్‌పల్లికి బస్సు సౌకర్యం కల్పించాలి

షాబాద్, జూన్ 24 : షాద్‌నగర్ నుంచి వయా మాచన్‌పల్లి చేవెళ్ల వరకు బస్సు సౌకర్యం కల్పించాలని మాచన్‌పల్లి గ్రామస్థులు సోమవారం షాద్‌నగర్ డిపో మేనేజర్ సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ ప్రతీరోజు విద్యార్థులు, గ్రామస్థులు వివిధ పనుల నిమిత్తం చేవెళ్లకు వెళుతుంటారని, బస్సు సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి సహకరించాలన్నారు. మాజీ సర్పంచ్ సత్తయ్య, గ్రామస్థులు కూతురు మహేందర్, హరికృష్ణ, నవీన్, స్వామి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.




ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న యువ నాయకుడు శివచారి

పాటు కాలువను పరిరక్షించండి

కొత్తూర్, జూన్ 24: మున్సిపాలిటీలోని జేపీ దర్గా రోడ్డులో గణపతి కాలనీకి ఆనుకొని ఉన్న పాటు కాలువ అక్రమణకు గురైందని, దాన్ని పరిరక్షించాలని కోరుతూ స్థానిక బీఆర్ఎస్ యువనాయకుడు కె.శివచారి కొత్తూర్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశానికి వచ్చిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బాలాజీలకు వినతి పత్రాలను అందజేశారు. కొత్తూర్ గ్రామపంచాయతీగా ఉన్నప్పుడు గణపతి కాలనీని ఏర్పాటు చేశారని, మురుగునీటి కాలువలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. ఇదిలా ఉండగా, కాలనీకి పక్కనే ఉన్న కాశనకుంట పాటు కాలువ కబ్జాకు గురికావడంతో వర్షకాలంలో నీరు ఇళ్లలోకి వచ్చి చేరుతోందని, కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ విషయమై గతంలో పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రవి, రంజిత్, సాగర్, అనిల్ తదితరులు వినతిపత్రాలు అందజేసిన వారిలో ఉన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం



మహేశ్వరం, జూన్ 24 : 108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవించిన సంఘటన మహేశ్వరంలో చోటు చేసుకుంది. సోమవారం మహేశ్వరం మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ మహేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రికి డెలివరీ కోసం వెళ్లింది. ఆసుపత్రి సిబ్బంది ప్రథమ చికిత్స చేసి డెలివరీ నిమిత్తం 108 వాహనంలో హైదరాబాదుకు తరలించేందుకు నిశ్చయించుకున్నారు. ఈక్రమంలో మార్గమధ్యలో గర్భిణీకి పురిటినొప్పులు ఎక్కువవ్వడంతో అంబులెన్స్‌లోనే సిబ్బంది నార్మల్ డెలివరీ చేశారు. మహిళ పండంటి మగ బిడ్డకు జన్మనివ్వడంతో కుటుంబ సభ్యులు, బంధువులు అంబులెన్స్ సిబ్బంది సురేందర్, యాదయ్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో అదేతీరు..!

- సప్లిమెంటరీలోనూ సత్తాచాటిన అమ్మాయిలు
- ఫస్టియర్‌లో 52.44శాతం.. సెకెండియర్‌లో 31.88శాతం



వికారాబాద్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో బాలుర కంటే బాలికలే పైచేయి సాధించారు. సోమవారం హైదరాబాద్‌లో ప్రకటించిన పరీక్షా ఫలితాల్లో ఆశించిన స్థాయిలో మెరుగైన ఫలితాలు రాకపోవడం గమనార్హం. ఇంటర్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఫస్టియర్‌లో 52.44శాతం, సెకెండియర్‌లో 31.88శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లాలో ఇంటర్ ఫస్టియర్ అడ్వాన్స్డ్ సప్లిమెంటరీ పరీక్షలకు జనరల్ విభాగంలో 4016మంది విద్యార్థులు హాజరు కాగా, వారిలో 2068మంది ఉత్తీర్ణులయ్యారు. ఈ పరీక్షలకు బాలురు 2073మంది జరు కాగా, వారిలో 899మంది ఉత్తీర్ణత సాధించి 43.37 శాతం నమోదైంది. బాలికలు 1943 మంది హాజరవగా వారిలో 1169 మంది ఉత్తీర్ణులై 60.16శాతం నమోదు చేసుకున్నారు. అదే ఒకేషనల్ విభాగంలో 610మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైతే వారిలో 358 ఉత్తీర్ణత సాధించి 58.69శాతం నమోదు చేసుకున్నారు. పరీక్షలకు 298మంది బాలురు హాజరు కాగా, వారిలో 132మంది ఉత్తీర్ణత సాధించి 44.3శాతం నమోదు చేసుకోగా, బాలికలు 312మంది హాజరయ్యారు. వారిలో 226మంది ఉత్తీర్ణులై 72.44శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు. సెకండియర్ పరీక్షల్లో జనరల్ విభాగంలో 2829మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా, వారిలో 837మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 29.59శాతం నమోదు చేసుకున్నారు. పరీక్షలకు 1640మంది బాలురు హాజరవగా, వారిలో 452మంది ఉత్తీర్ణత సాధించి 27.56శాతం నమోదు చేసుకున్నారు. బాలికలు 1189మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 385మంది ఉత్తీర్ణులై 32.38శాతం నమోదు చేసుకున్నారు. ఒకేషనల్ విభాగంలో 386 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 188 మంది ఉత్తీర్ణత సాధించి 48.7 శాతం నమోదు చేసుకున్నారు. బాలురు 251 మంది పరీక్షలకు హాజరు కాగా, వారిలో 113మంది ఉత్తీర్ణులై 45.02 శాతం నమోదు చేసుకున్నారు. బాలికలు 135 మంది పరీక్షలకు హాజరైతే వారిలో 75మంది ఉత్తీర్ణులై 55.56శాతం నమోదు చేసుకున్నారు.

మూలనపడిన 'ఓపెన్ జిమ్'

పరికరాలను ఎత్తుకెళ్లిన దొంగలు

- పట్టించుకోని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం
- వ్యాయామానికి దూరమవుతున్న పట్టణ వాసులు
- రెండేళ్లుగా పట్టించుకోని వైనం
- ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని కోరుతున్న ప్రజలు



మరమ్మతుకు నోచుకోని విలువైన పరికరాలు



తాండూరు ఆదర్శనగర్ ఓపెన్ జిమ్‌లో పాడైన పరికరాలు

తాండూరు, జూన్ 24: వేగవంతమైన జీవన విధానంలో విద్యార్థుల నుంచి వృద్ధుల వరకు రకరకాల ఒత్తిళ్లతో సతమతమవుతున్నారు. ఖాళీ లేకుండా గడిపే సగటు పట్టణవాసికి ఆహ్లాదం పంచడంతో పాటు, శరీరదారుఢ్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం ఓపెన్‌జిమ్ (బహిరంగ వ్యాయమశాల)లను ఏర్పాటు చేసింది. రాష్ట్ర పురపాలకశాఖ ఆధ్వర్యంలో టీఎండీసీ (తెలంగాణ మున్సిపాలిటీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు) ప్రపంచ బ్యాంకు నిధులు రూ.15లక్షల వ్యయంతో తాండూరు పట్టణం ఆదర్శనగర్‌లో ఏర్పాటు చేశారు. కానీ తాండూరు మున్సిపాలిటీ అధికారులు నిర్లక్ష్యంగా వదిలేశారు. రెండేళ్లుగా ఓపెన్ జిమ్‌ను 'క్లీన్ తెలంగాణ - పట్టణ గ్రీన్ తెలంగాణ' పేరిట చేపట్టారు. మొదట్లో ప్రజలు ఈ జిమ్‌లో వ్యాయమం చేసుకుని సంతోషించేవారు. రాను రాను నిర్వహణ లేక ప్రజలకు జిమ్‌కు దూరమైంది. జిమ్‌లో ఏర్పాటు చేసిన ఏరో వాల్కర్, చెస్ట్ ప్రెస్ డబుల్, సర్ఫబోర్డు, బిగ్‌ఆర్మీ వీల్, డ్యుయెల్ లెగ్‌ప్రెస్, ట్విస్టర్, పుల్‌చైర్, స్టాండింగ్, రోయింగ్‌మిషన్, డబుల్ ఆర్మీ స్టైంటర్, ఎలిపిటిక్ మిషన్, లెగ్ ఎక్స్టెన్సర్, స్పిన్నర్ వీల్, సిట్టింగ్ ట్విస్టర్ వంటి వ్యాయామ పరికరాలు మూలనపడ్డాయి. రెండేళ్లుగా మరమ్మతులు చేయించడం లేదు. మరికొన్ని పరికరాలను దొంగలు ఎత్తుకెళ్లారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం పర్యవేక్షణలో నిర్వహణ బాధ్యతను అప్పట్లో ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించగా వారు నిర్వహణ కొనసాగించడంలేదు. జిమ్‌లో ఏర్పాటు చేసిన 13రకాల పరికరాలు విరిగిపోయిన, తుప్పుపట్టిన పరికరాలు దర్శనమిస్తున్నాయి.

అధికారుల పట్టింపు కరువు

ఓపెన్ జిమ్ విషయంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో అధికారులు విఫలమవుతున్నారు. నిర్వహణ బాధ్యతలు పక్కనపెడితే లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ విషయమై ఉన్నతాధికారులకు లేఖ రాసిన పాపానపోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రెండేళ్లలో ముగ్గురు కమిషనర్లు మారినా పరిస్థితిలో ఎలాంటి మార్పులేదంటున్నారు. కనీసం ప్రస్తుత కమిషనర్ అయినా పట్టించుకుని ఓపెన్ జిమ్‌లో పరికరాలను మరమ్మతు చేయించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

'ఎమ్మెల్యేగారూ.. చొరవ తీసుకోండి'

తాండూరు ఓపెన్ జిమ్‌ను పునరుద్ధరించడంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చొరవ తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. మూలనపడిన ఓపెన్ జిమ్‌ను వినియోగంలోకి తీసుకొస్తే చిన్నారులు, యువకులు, క్రీడాకారులకు, వాకర్స్‌కు ఎంతగానో ఉపయోగపడుతుందని అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి పరికరాలను మరమ్మతు చేయించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.



విలేకరు సమావేశంలో మాట్లాడుతున్న డిసిపి శ్రీనివాస్

శాంతిభద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకమవ్వాలి

షాబాద్, జూన్ 24 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలతో మమేకమవ్వాలని రాజేంద్రనగర్ డీసీపీ సీ.హెచ్. శ్రీనివాస్ తెలిపారు. సోమవారం షాబాద్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడుతూ మండలంలో చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో పరిసరాల్లో పరిశ్రమలు ఉండడంతో వివిధ రాష్ట్రాలకు చెందిన కార్మికులు ఇక్కడ నివాసాలు ఏర్పాటు చేసుకున్నందున్నారని తెలిపారు. ఆ కారణం చేత నేరాలు ఎక్కువగా చోటుచేసుకునే అవకాశం ఉన్నందున ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలిపారు. మండలంలో ఎవరికైన జఠిలమైన సమస్యలు ఉంటే తనకు సమాచారం ఇవ్వాలన్నారు. ఫోన్‌నెంబర్ 8712663029లో సంప్రదించి సమస్యలు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏసీపీ కిషన్, షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి, ఎస్సైలు నవీన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

వ్యవసాయ పొలాలకు రోడ్ల నిర్మాణం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఆమనగల్లు, జూన్ 24: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా వ్యవసాయ పొలాలకు వెళ్లే రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతుల శ్రేయస్సు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటుందన్నారు. ఆమనగల్లు, సంకటోనిపల్లి, మంగళపల్లి, చంద్రాయన్‌బోడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు సోమవారం ఎమ్మెల్యేను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. సంకటోనిపల్లి రహదారి నుంచి వ్యవసాయ పొలాలకు వెళ్లే ఆమనగల్లు సురసముద్రం చెరువు బ్యాక్ వాటర్ కాల్వపై వంతెన నిర్మించాలని కాంగ్రెస్ జిల్లా నాయకులు తల్లోజు రామకృష్ణ, తాళ్ల రవీందర్ ల ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అనేక మంది రైతుల పొలాలు కాల్వ పైభాగంలో ఉన్నాయని.. వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పేర్కొన్నారు. కాల్వపై వంతెన నిర్మిస్తే నాలుగు గ్రామాలకు చెందిన అనేక మంది రైతులకు మేలు కలుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా రోడ్డులోని వాగు కాల్వపై వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. రైతులు గజ్జె జంగయ్య, తట్టిపల్లి నర్సింహ, వెంకటేశ్, గన్నోజు బాలయ్య, తాళ్ల రఘు, సత్యనారాయణ, బొల్లు శ్రీను, ఎంగిలి రఘు, తదితరులు ఉన్నారు.



పాఠశాల ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు

శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

యాచారం, జూన్ 24 : మండల కేంద్రంలో ప్రభుత్వ గుర్తింపు లేకుండా పాఠశాల నిర్వహిస్తున్న శ్రీ చైతన్య స్కూల్ యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ విద్యార్థులు పాఠశాల ఎదుట ధర్నా చేశారు. ప్రభుత్వం నుంచి గుర్తింపు లేకుండా పాఠశాల నడపరాదని డిమాండ్ చేశారు. యాజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్నా.. అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. పాఠశాలను తక్షణమే సీజ్ చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ నాయకులు విప్లవ్‌కుమార్, రాకేష్, నిఖిల్, శివ, తరంగ్, శ్రీకాంత్ తదితరులున్నారు.

బీజేవైఎం నాయకులపై దాడి హేయం

కేశంపేట, జూన్ 24: నిరుద్యోగ సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్ర బీజేవైఎం ఆధ్వర్యంలో శనివారం టీజీపీఎస్సీ వద్ద ఆందోళన చేసిన నాయకులను పోలీసులు విక్షణ రహితంగా కొట్టడం హేయమైన చర్య అని, పోలీసుల తీరును నిరసిస్తూ బీజేవైఎం ఆధ్వర్యంలో సోమవారం కేశంపేట మండల కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఉద్యోగ నోటిఫికేషన్లు లేక నిరుద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని, వారి సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకపోవడానికి శాంతియుత నిరసన చేస్తుంటే ప్రభుత్వం పోలీసులతో బీజేవైఎం కార్యాకర్తలను విచక్షణ రహితంగా కొట్టారని బీజేవైఎం అధికార ప్రతినిధి శివాజీ తెలిపారు. నిరుద్యోగుల సమస్యలపై పోరాటం చేస్తుంటే.. ప్రభుత్వం పరిష్కరించుకుండా దాడులకు తెగబడడం సమంజసం కాదన్నారు. విగ్నేష్, సురేష్, హరికృష్ణ, శ్రీకాంత్, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.



మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు సన్నాహాలు

మేడ్చల్, జూన్ 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహిళలను లక్షాధికారులుగా చేసేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి రుణాలు తీసుకుని చిన్నపాటి వ్యాపారాలు కొనసాగిస్తున్న స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వారితో క్యాంటీన్లు పెట్టించాలని భావిస్తోంది. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలని లక్ష్యం విధించారు. జిల్లాలో 3,390 స్వయం సహాయక సంఘాలు ఉండగా అందులో 36,782 మంది సభ్యులున్నారు. సంఘాల అర్హతను బట్టి రూ.50వేల నుంచి రూ.5లక్షల వరకు ఏటా బ్యాంకు లింకేజీ రుణాలు అందిస్తున్నారు. తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తే మళ్లీ ఇస్తారు. దీంతో పాటు ప్రభుత్వపరంగా క్యాంటీన్లు ఏర్పాటుచేసి వీటిని మహిళా సంఘాల సభ్యులకు కేటాయించాలని సర్కారు ఇటీవలే నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్‌లో మంత్రి సీతక్క చేతులమీదుగా క్యాంటీన్‌ను ఇటీవల ప్రారంభించారు. జిల్లాలోనూ వీటిని నెలకొల్పితే మహిళలకు ఇవి దన్నుగా నిలువనున్నాయి.



తినుబండారాలను తయారు చేస్తున్న మహిళలు



రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్

కార్యాచరణ తయారీలో..

జిల్లాలో మహిళా కాంటీన్లను పక్కాగా నిర్వహించేందుకు కార్యాచరణ తయారు చేయాలని కలెక్టర్ గౌతమ్ ఇటీవల సమావేశం నిర్వహించి ఆదేశించారు. అధికారులు ఆ పనిలో నిమగ్నమయ్యారు. మహిళలు, క్యాంటీన్లు నిర్వహించడంతో పాటు మీసేవా కేంద్రాలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు, కస్టం హైరింగ్, కుట్టు కేంద్రాలు, పాడి పశువులు, పౌల్ట్రీ, సంచార మత్స్య విక్రయ ఔట్‌లెట్లు, మిల్క్ పార్లర్స్ ఏర్పాటు చేసేందుకు మండలాల వారీగా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. ఇప్పటికే మహిళా సంఘాల సభ్యులతో ఏకరూప దుస్తులు కుట్టించే కార్యక్రమం పూర్తయింది. ఆయా యూనిట్లు నెలకొల్పేందుకు అర్హులైన వారిని ఎంపిక చేసేందుకు త్వరలోనే ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.

స్థలాల కోసం అన్వేషణ

డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లాలో పలుచోట్ల మహిళా క్యాంటీన్లు ఏర్పాటు చేయాలనే లక్ష్యంఉండగా అందుకు అనువైన స్థలాలను ఎంపిక చేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల సముదాయం ఉండే కలెక్టరేట్‌తో పాటు ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతాలు అనుకూలంగా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీన్ మేడ్చల్ జిల్లాకు దక్కడంతో సెక్రటేరియట్ భవనం జీప్లస్ 5వ అంతస్తులో ఏర్పాటు చేసిన మహిళా క్యాంటీనుకు ఊహించినదానికంటే ఎక్కువ స్పందన రావడంతో అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలోనే ఏర్పాటు చేస్తాం

మహిళా సంఘాలకు క్యాంటీన్ల నిర్వహణ బాధ్యతలు ఇవ్వాలని ప్రభుత్వం నుండి ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో పలు చోట్ల నెలకొల్పేందుకు అనువైన స్థలాలు చూస్తున్నాం. అవి గుర్తించగానే అర్హులైన మహిళా సంఘాలన ఎంపిక చేసి నిర్వహణ బాధ్యత అప్పగిస్తాం. ఇతర యూనిట్లను సైతం నెలకొల్పి మహిళలను మరింత ఆర్థిక బలోపేతం చేస్తాం. - సాంబశివరావు, డీఆర్‌డీవో, మేడ్చల్ - మల్కాజిగిరి



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో శోభారాణి

పిల్లల సమగ్రాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి : సీడీపీవో

చేవెళ్ల, జూన్ 24 : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల సమగ్రాభివృద్ధిపై మరింత బాధ్యతగా శ్రద్ధ వహించాలని చేవెళ్ల సీడీపీవో శోభారాణి తెలిపారు. సోమవారం చేవెళ్ల మండల కేంద్రంలోని అంగన్‌వాడీ టీచర్ల శిక్షణలో భాగంగా సీడీపీవో పాల్గొని మాట్లాడారు. చేవెళ్ల ప్రాజెక్టు పరిధిలో 10 సెక్టార్లలో ఉన్న 35 మంది అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ప్రీస్కూల్ ప్రాముఖ్యత, పిల్లల అభివృద్ధి, పెరుగుదల సమగ్రామభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల అభివృద్ధి కోసం నూతన పద్ధతులను అమలు చేస్తుందన్నారు. పిల్లలకు ఆటపాటలు, సంభాషణ, కథ, సృజనాత్మకత, శాస్త్రీయ పరిజ్ఞానం తదితర అంశాలపై పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ట్రైనింగ్ మాస్టర్ భారతిరత్నం, సూపర్‌వైజర్ శ్రీలక్ష్మి, సునిత, కవిత, నాగమణి, రమాదేవి, శకుంతల, అనురాధ, సృజనవాణి, పారిజాత తదితరులు పాల్గొన్నారు.



మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం ఇస్తున్న సభ్యులు

317 జీవో అమలులో అవకతవకలపై విచారణ జరిపించాలి

రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : జీవో 317 అమలులో జరిగిన అవకతవకలపై వెంటనే సమగ్ర విచారణ జరిపించాలని సేవ్ రంగారెడ్డి జిల్లా కోర్ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం మంత్రి శ్రీధర్ బాబుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను సేవ్‌కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రంగారెడ్డి జిల్లాలో 317 జీవో అమలు ప్రక్రియ ద్వారా ఉపాధ్యాయుల కేటాయింపులో జరిగిన అవకతవకలపై సమగ్ర విచారణ జరిపి జిల్లాకు అక్రమంగా వచ్చిన వారిని ఆయా జిల్లాలకు తిరిగి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవ్ రంగారెడ్డి జిల్లా ఉద్యమ సంస్థ కోర్ కమిటీ సభ్యులు పొనగంటి మహిపాల్ రెడ్డి, బి.మధుకర్‌రెడ్డి, తలారీ సురేష్, జయశీల, జగదీశ్వర్‌రెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, సునీత, మాధురి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నాయకులను అరెస్టు చేస్తున్న పోలీసులు

పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థికి విద్యుత్ షాక్

షాద్‌నగర్, జూన్ 24 : మేధా పాఠశాల యాజమాన్యం నిర్లక్ష్యంతోనే విద్యార్థి విద్యుత్ షాక్ గురయ్యాడంటూ ఏబీవీపీ నాయకులు ఆరోపించారు. ఈమేరకు సోమవారం పాఠశాల ఎదుట విద్యార్థి తల్లితండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మహేష్ మాట్లాడుతూ ఈనెల 22న మేధా పాఠశాల విద్యార్థికి పాఠశాల ఆవరణలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తగలడంతో విద్యుత్‌షాక్‌కు గురై తీవ్రగాయాల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పాఠశాల సిబ్బందిని వివరణ కోరగా.. ఆ బాలుడు స్కూల్‌కు రావడానికి ఇష్టం లేక గోడ దూకి పారిపోయేందుకు యత్నిస్తున్న తరుణంలోనే విద్యుత్ షాక్‌కు గురయ్యాడని చెప్పడం హాస్యాస్పదమన్నారు. తమ మీద ఎలాంటి అపవాదు రావద్దన్న ఉద్దేశంతోనే సిబ్బందితో పాటు, యాజమాన్యం కూడా అబద్దాలు చెబుతున్నారని అన్నారు. ఈ విషయంపై పాఠశాల సిబ్బంది, యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, షాద్‌నగర్ పట్టణానికి చెందిన అర్మాన్ అనే 5వ తరగతి విద్యార్థి గత శనివారం ప్రమాదానికి గురయ్యాడు.

ఉపాధ్యాయ బదిలీలు చేపట్టాలి

● ప్రభుత్వ తీరుపై జిల్లావ్యాప్తంగా టీచర్ల నిరసన



చేవెళ్ల : తహసీల్దార్ కృష్ణయ్యకు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

ఆమనగల్లు, జూన్ 24 : జిల్లాలో ఆగిపోయిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలను ఇదే షెడ్యూల్‌లో కొనసాగించాలని కోరుతూ ఆమనగల్లు పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఉపాధ్యాయినులు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి భోజన విరామ సమయంలో పాఠశాల ఎదుట బైటాయించి ఆందోళనకు దిగారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా మాదిరిగా రంగారెడ్డి జిల్లాలో పదోన్నతులు, బదిలీలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. టీచర్లు సుశీల, అరుణ, కరుణశ్రీ, లక్ష్మీదేవి, విజయలక్ష్మి, భార్గవి, రాధిక, నాగ సుందరి, తదితరులు పాల్గొన్నారు.



యాచారం : మాల్ ఉన్నత పాఠశాలలో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

చేవెళ్ల : జిల్లాలో పని చేస్తున్న అదనపు ఉపాధ్యాయులను వారి వారి సొంత జిల్లాలకు పంపి స్థానిక ఉపాధ్యాయ, నిరుద్యోగులకు న్యాయం చేయాలని రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక స్టీరింగ్ కమిటీ నాయకులు కోరారు. ఈమేరకు ఆ సంఘం నాయకులు తహసీల్దార్ కృష్ణయ్యను కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు తదితరులున్నారు.

కొందుర్గు : జిల్లాలోని ఉపాధ్యాయ బదిలీలకు అవకాశం కల్పించాలని కోరుతూ యుఎస్‌పీసీ జాక్‌టో స్టీరింగ్ కమిటీ కొందుర్గు మండల ఉపాధ్యాయులు రెవెన్యూ ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్ ప్రకాష్‌కు వినతిపత్రం అందజేశారు. ఉన్నతాధికారులు కల్పించుకొని ప్రమోషన్లు, బదిలీలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వెంకటయ్య, టీఎస్‌బీటీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.శివారెడ్డి, ఉపాధ్యాయులు హన్మంత్, బి.అశోక్‌కుమార్, వి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్‌లను వెంటనే చేపట్టాలని మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన సమయంలో నిరసన చేపట్టారు.



కందుకూరు : తహసీల్దార్ గోపాల్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయ సంఘాల నేతలు

గూడూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఎస్‌ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎండీ బషీర్ మాట్లాడుతూ అన్ని జిల్లాల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, భాషోపాధ్యాయుల అప్‌గ్రేడేషన్ జరిగి పదోన్నతి పొందుతుంటే, రంగారెడ్డి జిల్లాలో క్యాడర్‌స్ట్రెంత్ కారణంగా ఆగిపోవడం శోచనీయమన్నారు. టీచర్లు ఎండీ అయూబ్, మృణాళిని, ఓంకారం, శ్రీదేవి, తదితరులున్నారు.

కందుకూరు : 310 జీవోలో క్యాడర్ స్ట్రెంత్‌కి మించి అదనంగా జిల్లాలో వివిధ పాఠశాలల్లో నియమించిన ఉపాధ్యాయులను తిరిగి పంపాలని టీఎస్‌టీయూ, ఎస్‌ఎల్‌టీఏ, పీఆర్‌టీయూ సంఘాల నేతలు తహసీల్దార్ కె.గోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఆ సంఘాల మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎడ్ల కల్లేష్, బుగ్గ రాములు, బషీర్, జి.నాగేందర్, ఎల్.జంగయ్యలు మాట్లాడుతూ జిల్లాలో కూడా అర్హత ఉన్న ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్లుగా ప్రమోషన్‌లు కల్పించాలన్నారు. నాయకులు హెచ్.జంగయ్య, డి.కృష్ణయ్య, ఎస్.అంబదాస్, కె.గోపాల్, యు.లావణ్య, వనజ, ఉమ, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్ : జిల్లా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కడుమూరి సుదర్శన్ అన్నారు. హైతాబాద్, తాళ్లపల్లి, షాబాద్ ఉన్నత పాఠశాలలో నల్ల బాడ్జీలతో నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో కాడర్ స్ట్రెంత్ కంటే ఎక్కువ ఉన్న టీచర్లను వెనక్కి పంపి, ప్రస్తుత ప్రమోషన్, బదిలీలల్లో జిల్లా ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని అన్నారు.

కేశంపేట : రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చేపట్టిన జిల్లాను మినహాయించడం సమంజసం కాదని టీఎస్‌యూటీఎఫ్ మండలశాఖ అధ్యక్షుడు రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి రవికుమార్‌లు అన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఉపాధ్యాయులు ఆర్‌ఐ నివేదితకు బదిలీలు చేపట్టాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రకాశ్, శ్యామలదేవి తదితరులున్నారు.

యాచారం : ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులు చట్టబద్ధంగా చేపట్టాలని డిమాండ్ చేస్తూ మండలంలోని గ్రామాల్లో ఉపాధ్యాయులు పాఠశాలల్లో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు అంజయ్య, నర్సింహ తదితరులున్నారు.

యాచారం ఎంపీవోగా శ్రీలత

యాచారం, జూన్ 24 : యాచారం మండల ఎంపీవోగా శ్రీలత సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె గతంలో ఆ మనగల్లు మండలానికి డిప్యుటేషన్‌పై వెళ్లారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీవో ఉమారాణి ఆమనగల్లుకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా శ్రీలత మాట్లాడుతూ వృత్తి, ఇంటిపన్నులు పంచాయతీలకు చెల్లించి గ్రామాల ప్రగతికి సహకరించాలని మండల ప్రజలను కోరారు.

ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూన్ 24 : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ శశాంక అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఆయన ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులకు, సంబంధిత రెవెన్యూ అధికారులకు పంపించడం జరిగిందని, అధికారులు ప్రజా సమస్యలను ఆన్‌లైన్‌లో సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి ద్వారా వచ్చిన దరఖాస్తులను వారం లోపు పరిష్కరించాలని తెలిపారు. అదేవిధంగా కోర్టుకు సంబంధించిన కంటెంట్ కేసులకు మండల తహసీల్దారులు హాజరై వివరణ ఇవ్వాలని ఆయన సూచించారు. ప్రజావాణిలో 140 ఫిర్యాదులు వచ్చాయి. అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్వో సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

తలకొండపల్లి, జూన్ 24: 2024-25 విద్యా సంవత్సరానికి గాను తలకొండపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ అనసూయ తెలిపారు. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఎల్‌టీ, ఒకేషన్ గ్రూపులకు తెలుగు, ఇంగ్లీష్ మీడియాల్లో అడ్మిషన్లు ప్రారంభించినట్లు పేర్కొన్నారు. మండల, పరిసర ప్రాంతాల టెన్త్ ఉత్తీర్ణులైనవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు జూనియర్ అసిస్టెంట్ కిరణ్‌కుమార్‌ను సంప్రదించాలన్నారు.

'రైతు రుణమాఫీ' హర్షణీయం

● కాంగ్రెస్ నాయకులు
● రేవంత్ చిత్రపటానికి పాలాభిషేకం

ఆమనగల్లు, జూన్ 24: కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీకనుగుణంగా రైతులకు రూ.2లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించడం హర్షణీయమని నాయకులు అన్నారు. ఈమేరకు ఆమనగల్లు పట్టణంలో సోమవారం కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. రాజీవ్‌చౌక్ వద్ద మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహులు నాయకులు కాంగ్రెస్ జెండాలు చేబూని హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై ర్యాలీ నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, మాజీఎంపీపీ ధనుంజయ్య, విజయ్, కృష్ణనాయక్, చేగూరి వెంకటేష్, తదితరులున్నారు.



మహేశ్వరం : సంబురాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

కడ్తాల్ : రైతు రుణమాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకున్నారు. మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు తదితరులు పాల్గొన్నారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి ర్యాలీ నిర్వహించారు. చేగూరి వెంకటేష్, జహంగీర్‌బాబా, లక్‌పతి నాయక్, రాంచందర్ నాయక్, గూడూరు భాస్కర్ రెడ్డి, కృష్ణ, తదిరతులు పాల్గొన్నారు.



మాడ్గుల : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తలకొండపల్లి : రైతు రుణ మాఫీ నిర్ణయాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో పెద్దఎత్తున సంబురాలు జరుపుకున్నారు. సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి ర్యాలీ నిర్వహించి బాణా సంచా కాల్చారు. పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవ రెడ్డి, పీసీసీ కిసాన్‌సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి అంజయ్య, ఉపాధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, కార్యదర్శి రవీందర్‌యాదవ్, అజీం, డిగ్రీ కృష్ణ, దామోదర్, అంబాజీ, అజీజ్, కృష్ణ, కృష్ణారెడ్డి, శ్రీశైలం, ప్రదీప్‌రెడ్డి, శేఖర్ తదితరులున్నారు.

మహేశ్వరం : ప్రభుత్వం రైతురుణమాఫీ నిర్ణయం తీసుకోవడం హర్షించదగ్గ విషయమని పీసీసీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో నాయకులు, రైతులు స్వీట్లు పంచుకున్నారు. ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ఎంపీపీ సునితఅంద్యానాయక్, మాజీ ఎంపీపీ రఘుమారెడ్డి, మాజీ జడ్పీటీసీ జంగయ్య, నాయకులు ఈశ్వర్‌ముదిరాజ్, ఎ.ప్రశాంత్‌రెడ్డి, యా దయ్య, రవినాయక్, జి.జంగయ్య, ఐ.వెంకటేష్, ఎ.నర్సింహ, బాల్‌రాజ్, రాజునాయక్, లాజర్ తదితరులున్నారు.

మాడ్గుల : రైతులకు ఒకేసారి రెండు లక్షల మాఫీ చేస్తున్నందుకు మండల రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ అన్నెపాక జంగయ్య, మాజీ ఎంపీటీసీ దేవయ్య గౌడ్, కాంగ్రెస్ నాయకులు మక్తాల కృష్ణయ్యగౌడ్, అన్నెపాక కిరణ్, భీరయ్య, ఎమ్మె శ్రీను, రేవంత్‌రెడ్డి మిత్రమండలి అధ్యక్షుడు జింకల భాస్కర్‌లు పాల్గొన్నారు.



ఆమనగల్లు : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

ఉద్యోగిపై ఎమ్మెల్యే దుర్భషలాడటం తగదు

షాద్‌నగర్, జూన్ 24 : మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రామ్ రెడ్డిపై జడ్చర్ల ఎమ్మెల్యే దుర్భషలాడటం తగదని షాద్‌నగర్ నియోజకవర్గ రెవెన్యూ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఫరూఖ్‌నగర్ మండల డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. రెవెన్యూ సిబ్బంది మాట్లాడుతూ పని ఒత్తిడి మేరకే ఆదివారం కూడా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అసలు విషయాన్ని తెలుసుకోకుండా ఎమ్మెల్యే ఉద్యోగిపై మండిపడటం సమంజసం కాదని వారు అన్నారు.

కోట్ల విలువచేసే భూముల కబ్జా : ఎంపీపీ

మహేశ్వరం, జూన్ 24 : మండల పరిధిలోని పలుగ్రామాల్లో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, మాజీ మంత్రి మహేశ్వరం ఎమ్మెల్యే సహకారంతో అక్రమార్కులు ఎక్కడపడితే అక్కడ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని ఎంపీపీ సునిత అంద్యానాయక్ ఆరోపించారు. సోమవారం మహేశ్వరంలోని ఎంపీపీ చాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని మన్‌సాన్‌పల్లి గ్రామ సర్వే నెంబర్ 136, 140లోని ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదన్నారు. కల్వకోల్, పోరండ్ల, గంగారం, తుమ్మలూరు, మన్‌సాన్‌పల్లి, నాగిరెడ్డిపల్లె, ఉప్పుగడ్డ తండా, కోళ్లపడకల్, గొల్లూరు, సిరిగిరిపురం గ్రామాల రెవెన్యూలో మట్టిమాఫియా పెద్దఎత్తున మట్టి తరలిస్తున్నారని తెలిపారు. మన్‌సాన్‌పల్లి వద్ద నిర్మించిన రెండు పడక గదుల ఇళ్లలో స్థానికేతరులకు అనర్హులకు, పలువురు బీఆర్‌ఎస్ నాయకులకు అవకాశం ఇచ్చారని తగిన విచారణ చేపట్టి అర్హులైన పేదలకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో సీఎం దృష్టికి తీసుకెళ్లానన్నారు.

సంక్షిప్తంగా..

కడ్తాల్ : పది సంవత్సరాలు బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. సమస్యల పరిష్కారానికి కృషి చేయని కడ్తాల జడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్.. మరో పది రోజుల్లో పదవీకాలం ముగుస్తున్న నేపథ్యంలో రాజకీయ డ్రామా ఆడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వంపై అభియోగాలు మోపి రాజకీయ లబ్ధికి యత్నిస్తున్నారని కాంగ్రెస్ పార్టీ కడ్తాల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రాంచందర్ నాయక్, ఎస్సీ సెల్ ఆమనగల్లు బ్లాక్ అధ్యక్షుడు కంబాల రామకృష్ణలు ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ లబ్ధికి దశరథ్ నాయక్ సాగిస్తున్న ఎత్తుగడలు ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే కడ్తాలలో కేజీబీవీ భవన నిర్మాణంలో ఏళ్లకాలం జాప్యం జరిగిందన్నారు. నిర్మాణం పూర్తైన భవనాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబుచే ప్రారంభించడానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఏర్పాట్లు చేస్తుంటే.. జడ్పీటీసీ రాజకీయం చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు.

శంకర్‌పల్లి : దాతలు హైమావతి, సుచిత్రల సహకారంతో కొత్తపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో టెన్త్ విద్యార్థులకు హార్ట్ టూ హెల్ప్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ రవినాయక్‌తో కలిసి నోట్‌పుస్తకాలను అందజేశారు. మొగులయ్య, సత్యనారాయణ, రాజా, జ్యోతి. అనుపమ, వరలక్ష్మి తదితరులు ఉన్నారు.

మాడ్గుల : మండలంలోని ఆర్కపల్లిలో గల ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమిస్తున్నారని, వారినుంచి భూమిని కాపాడాలని సోమవారం తహసీల్దార్ సునిల్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందచేశారు. ఆర్కపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెంబర్ 65లో గల భూమికి సంబంధించిన రికార్డుల్లో అవకతవకలు జరుగుతున్నాయని, కొందరు ఆ భూములను స్వాధీనం చేసుకునేందుకు యత్నిస్తున్నారని వినతి పత్రంలో పేర్కొన్నారు. తహసీల్దార్ త్వరలో పరిశీలించి న్యాయం చేస్తానన్నారు.

రైతు సమస్యలకు ప్రాధాన్యమివ్వండి



షాద్‌నగర్ : రెవెన్యూ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్, జూన్ 24 : రైతు సమస్యలకు ప్రాధాన్యమిచ్చి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రెవెన్యూ అధికారులకు సూచించారు. సోమవారం షాద్‌నగర్ పట్టణ శివారులోని ఆర్డీవో కార్యాలయంలో రెవెన్యూ సమస్యలపై ఆర్డీవో వెంకటమాధవరావుతో కలిసి సమీక్షించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం వ్యవసాయానికి అత్యంత ప్రాధాన్యమస్తుందన్నారు. భూములకు సంబంధించి రెవెన్యూ కార్యాలయాలకు వచ్చే రైతుల సమస్యలను వెంటనే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధరణిలో నెలకొన్న సమస్యలను కూడా పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. కొత్తూరు, నందిగామ, చౌదరిగూడ, కొందుర్గు, కేశంపేట తహసీల్దారులు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు ఫ్లైఓవర్లు నిర్మించండి

పట్టణాల్లో ఉన్న జాతీయ రహదారులపై ప్రమాదాలు నివారించేందుకు ఫ్లైఓవర్లు నిర్మించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి నేషనల్ హైవేస్ సంస్థ అధికారులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సాయంత్రం హైదరాబాద్‌లోని జాతీయ రహదారుల సంస్థ జనరల్ మేనేజర్ కం ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావుతో సమావేశమయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ షాద్‌నగర్ పట్టణంలోని దూసకల్, కేశంపేట రోడ్, సోలిపూర్ వైజంక్షన్ మీదుగా జాతీయ రహదారి నెంబర్ 44 మీదుగా రోజుకు వేలాది వహనాలు అత్యంత వేగంతో ప్రయాణిస్తుండటం వల్ల తరచూ ప్రమాదాలు జరిగి మరణాలు సంభవిస్తున్నాయని తెలిపారు. ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మిస్తే ప్రమాదాల జరిగే అవకాశం ఉండదన్నారు. అలాగే జాతీయ రహదారుల పక్కన సర్వీస్ రోడ్ల నిర్మాణాలు కూడా చేపట్టాలని కోరారు.

కొత్తూర్ అండర్‌పాస్ పరిశీలన

కొత్తూర్ : కొత్తూర్ అండర్‌పాస్ ప్రజలకు నిరుపయోగంగా ఉన్నందున వై జంక్షన్ నుంచి జేపీ దర్గా జంక్షన్ వరకు ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే ఎన్‌హెచ్‌ఏఐ అధికారులకు సూచించారు. కొత్తూర్ అండర్‌పాస్ వద్ద వర్షపునీరు వచ్చి చేరుతుండడంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతూ వస్తున్నారు. ఆదివారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అండర్‌పాస్‌ను పరిశీలించారు. ఆయన సూచనతో ఎన్‌హెచ్‌ఏఐ ఏఈ భానుశర్మ, బైపాస్ రహదారి ఇన్‌చార్జి ఇబ్రహీంలు ఎమ్మెల్యేతో కలిసి సోమవారం అండర్‌పాస్‌ను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అండర్‌పాస్ నిర్మాణానికి సాంకేతిక లోపాలు ఉన్నాయని, వర్షపు నీరు వచ్చి చేరుతుందన్నారు. ఈ సమస్యను ఎన్‌హెచ్‌ఏఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకపోతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, నాయకులు జె.సుదర్శన్‌గౌడ్, అంబటి ప్రభాకర్, జె.గోవర్ధన్‌గౌడ్, జనార్ధన్‌చారి, దేవేందర్‌ముదిరాజ్, జెనిగె జగన్, ఎమ్మె సత్తయ్య, సురేందర్, జగన్‌గౌడ్, తదితరులున్నారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



భట్టిని సన్మానిస్తున్న నాయకులు

ఆమనగల్లు, జూన్ 24: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ శ్రేణులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కోరారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం వెళ్తున్న ఉప ముఖ్యమంత్రి విక్రమార్కకు ఆమనగల్లు పట్టణంలోని రాజీవ్ చౌక్ వద్ద కాంగ్రెస్, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జగన్ ఆధ్వర్యంలో నాయకులు సత్కరించి అభినందించారు. ఎంపీపీ అనితవిజయ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కృష్ణనాయక్, బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలీల్, మాజీ ఎంపీపీ ధనుంజయ్య, నాయకులు తదితరులున్నారు. కాగా, మంత్రి జూపల్లి కృష్ణారావును కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఘనంగా సత్కరించారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు స్వాగతం పలకడానికి ఆమనగల్లుకు వచ్చిన జూపల్లిని సత్కరించారు. కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని కోరారు. భట్టి విక్రమార్కకు అచ్చంపేట ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి స్వాగతం పలికారు. అనంతరం భట్టిని పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. భట్టి వెంట శ్రీశైలం శ్రీభ్రమరాంభ మల్లిఖార్జున స్వామి దేవాలయాన్ని దర్శించుకొని కసిరెడ్డి పూజలు నిర్వహించారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

● యువతికి తీవ్రగాయాలు.. పరిస్థితి విషమం
● ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు
● మృతుడు కడ్తాల మండలం ముద్విన్ మాజీ సర్పంచ్



మంటల్లో కాలిపోతున్న బైక్



యాదయ్య(ఫైల్)

కందుకూరు/ కడ్తాల్, జూన్ 24 : హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై కారు బైక్ ను ఢీకొన్న ఘటనలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా యువతికి తీవ్రగాయాలైన ఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని దెబ్బడగూడ గేటు సమీపంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో బైక్‌కు మంటలు అంటుకొని పూర్తిగా కాలింది. స్థానికులు, బాధితులు, పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కడ్తాల్ మండల ముద్విన్ గ్రామ మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకుడు ఈర్లపల్లి యాదయ్య(48)అదే గ్రామానికి చెందిన పోలె సంధ్య(18)తో కలిసి కందుకూరు మండల కేంద్రం నుంచి సోమవారం రాత్రి ముద్విన్ గ్రామానికి బైక్‌పై వెళుతున్నారు. ఈక్రమంలో కందుకూరు మండల పరిధిలోని దెబ్బడగూడ గేటు సమీపంలో ఎదురుగా వచ్చిన కారు బైక్‌ను బలంగా ఢీకొట్టింది. దాంతో బైక్ రోడ్డు పక్కన ఉన్న డివైడర్‌కు బలంగా తగిలింది. యాదయ్య, సంధ్యలు కిందపడ్డారు. డివైడర్‌కు తగలడంతో యాదయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. సంధ్యకు తీవ్రగాయాలయ్యాయి. బైక్ డివైడర్‌కు తాకడంతో మంటలు చెలరేగి పూర్తిగా కాలింది. ఎస్సై శ్రవణ్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. సంధ్యను శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. యాదయ్య శవాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ముద్విన్ మాజీ సర్పంచ్ మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. సర్పంచ్‌గా ఆయన విశేష కృషి సలిపారు. ప్రజా సమస్యలపై అనేక పోరాటాలు సాగించారు. ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, తదితరులు సంతాపం తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ..

ఆదిభట్ల, జూన్ 24 : గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో బొంగ్లూరు ఔటర్ సర్వీస్ రోడ్డులో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఆదిభట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొంగర కలెక్టరేట్ నుంచి బొంగ్లూర్ వచ్చేదారిలో ఔటర్ సర్వీస్ రోడ్డులో ప్రమాదం జరిగినట్లు సమాచారం అందింది. సర్వీస్ రోడ్డుపై వెళ్తున్న మహిళను గుర్తుతెలియని వాహనం ఢీకోవడంతో తలకు బలమైన గాయమైంది. 108 సహాయంతో ఉస్మానియాకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందింది. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీలో భద్రపర్చారు. మృతురాలు సుమారుగా 30 సంవత్సరాల వయస్సు 5.7 అడుగుల ఎత్తు కలిగి చామనచాయ రంగులో ఉంది. ఒంటిపై ఎరుపు రంగు చెక్స్ కలిగిన కుర్తా, గులాబి రంగు ప్యాంటు, కటింగ్ చేయబడిన జుట్టుతో ఉన్నారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఆదిభట్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్‌రెడ్డి సెల్ : 8712662364, పోలీస్‌స్టేషన్ 8712662671 సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

షాద్‌నగర్ రూరల్, జూన్24: రైలుకింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపారు. షాద్‌నగర్ నుంచి హైదరాబాద్ వెళ్లేదారిలో కీర్తి వెంచర్ సమీపంలో సుమారు 30 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి గుంటూరు నుంచి కాచిగూడ వెళ్లే రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్రంగా గాయపడటంతో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలిస్తుంగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

మైనర్ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి కఠిన కారాగార శిక్ష

రంగారెడ్డి కోర్టులు, జూన్ 24(ఆంధ్రజ్యోతి): బాలిక పట్ల అస్యభంగా ప్రవర్తించిన కేసులో నిందితుడికి జైలు, జరిమానాతో పాటు బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని అత్యాచారం, పోక్సో కోర్టు న్యాయమూర్తి తీర్పు చెప్పారు. స్పెషల్ పీపీ సునీత బర్ల కథనం ప్రకారం.. గుర్రంగూడకు చెందిన మల్లిఖార్జున్ అదే ప్రాంతానికి చెందిన బాలికపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దాంతో బాధితురాలి తల్లి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో స.హ కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన పోక్సో కోర్టు న్యాయమూర్తి ఎమ్.కె. పద్మావతి నిందితుడికి 5 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ. 10వేల జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.లక్ష నష్టపరిహారం చెల్లించాలని తీర్పు ఇచ్చారు.

జామపండ్లు తెంపాడని బాలుడిని కట్టేసి కొట్టారు

● బాధితుడి తల్లి ఫిర్యాదు మేరకు అట్రాసిటీ కేసు నమోదు

షాబాద్, జూన్ 24 : జామపండ్లు తెంపాడని ఓ బాలుడిని కట్టేసి కొట్టిన సంఘటన రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం కేసారంలో సోమవారం చోటు చేసుకుంది. కేసారానికి చెందిన బాలుడు బేగరి యాదగిరి ఏడో తరగతి చదువుతున్నాడు. యాదగిరి తన స్నేహితులతో కలిసి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ఇంటి గోడదూకి జామపండ్లు తెంపేందుకు వెళ్లాడు. అది గమనించిన మధుసూదన్‌రెడ్డి వారిని వెంబడించగా యాదగిరి దొరికాడు. మధుసూదన్‌రెడ్డి బాలుడిని తాడుతో కట్టేసి కొట్టాడు. చిన్న పిల్లాడని చూడకుండా తాడుతో కట్టేసి కొడతావా? అని యాదగిరి తల్లిదండ్రులు మధుసూదన్‌రెడ్డితో గొడవపడ్డారు. ముసలివాళ్లమయిన తనను, తన భార్యను బాలుడు తోసేసి పారిపోయేందుకు యత్నించినందుకే అలా చేశానని మధుసూదన్‌రెడ్డి చెప్పాడు. దీంతో ఆగ్రహించిన బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదగిరి తల్లి అమృత ఫిర్యాదు మేరకు మధుసూదన్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మున్సిపల్ కౌన్సిల్‌కు విలేకరులకు నో ఎంట్రీ

● హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి

కొత్తూర్, జూన్ 24: కొత్తూర్ మున్సిపల్ కౌన్సిల్ మీటింగ్‌కు స్థానిక విలేకరులకు అనుమతి ఇవ్వకపోవడంతో వెనుతిరాగాల్సి వచ్చింది. మున్సిపాల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ లావణ్యదేవేందర్‌యాదవ్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డిలు హాజరైనారు. సమావేశానికి స్థానిక విలేకరులు హాజరయ్యేందుకు వెళ్లగా, మున్సిపల్ అధికారులు అనుమతి లేదని అనడంతో వెనుతిరాగాల్సి వచ్చింది. సమావేశంలో ఏం జరుగుతుందో ప్రజలకు తెలియాల్సిన అవసరముందని, తమను అనుమతిస్తే విషయాలు బయటకు వస్తాయని పలువురు అభిప్రాయపడ్డారు.

సమస్యలు పరిష్కారించాలని ఎమ్మెల్యేకు వినతి

కొత్తూర్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కారించాలని కోరుతూ స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు, ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ అసుపత్రి, పాత జేపీ దర్గా రోడ్డు వెడల్పు, డబల్ బెడ్‌రూం ఇళ్లు, రజక భవనం తదితర సమస్యలను పరిష్కారించాలని కోరుతూ నాయకులు ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ త్వరలోనే సమస్యలను పరిష్కారిస్తానని హామి ఇచ్చారు. జె. సుదర్శన్‌గౌడ్, దేవేందర్‌ముదిరాజ్, అంబటి ప్రభాకర్, శ్రీను, గోవింద్‌నాయక్ తదితరులు వినతిపత్రాన్ని అందజేసిన వారిలో ఉన్నారు.